క్లుప్తంగా

హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా సరిత ఎంపిక


మందుల సరిత

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన మందుల సరిత సోమవారం టీజీపీఎస్సీ విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మహిళా విభాగంలో 4వర్యాంకు సాధించింది. ఆమెను పలువురు అభినందించారు.

చివ్వెంల వాసికి 633వ ర్యాంకు


మీసాల ప్రియదర్శిని

చివ్వెంల : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన హాస్టల్ వెల్ఫేర్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన మీసాల ప్రియదర్శిని రాష్ట్రస్థాయి 633వ ర్యాంకు సాధించింది. జోనల్ ఎస్సీ మహిళా విభాగంలో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించింది. దీంతో బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారిణిగా ఆమె ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల ప్రజలు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

ఎస్ఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల ఎస్ఐగా సీహెచ్ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటేశ్వర్లు నల్లగొండ (వీఆర్) నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సురేష్ ఏసీబీకి పట్టుపడడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ముగిసిన ఉపాధిహామీ గ్రామసభలు


నెమ్మికల్లులో నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ గ్రామసభలో పాల్గొన్న అధికారులు, కూలీలు

ఆత్మకూర్ (ఎస్): మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామసభలు సోమవారం ముగిశాయి. కాగా మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓపెన్‌ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హాసీం తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్‌లు వీరస్వామి, సురేష్

అర్వపల్లి : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవమైన గంగదేవమ్మ ఆలయం వద్ద సీసీరోడ్డు నిర్మాణం పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బుడిగె వెంకన్న, బొల్లం నిమ్మమ్మ, సింహాద్రి, వీరస్వామి, మల్లయ్య, బాలరాజు, జానయ్య, మల్లయ్య, రాజయ్య, రమేష్, వెంకన్న, ఉమేష్, ఉజ్జిత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం


చెక్కు అందజేస్తున్న ఎల్లు అశోక్‌రెడ్డి

మద్దిరాల : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు వరంలాంటిదని కాంగ్రెస్ మండల నాయకుడు ఎల్లు అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన శేరి మల్లయ్య అనారోగ్యం కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా అతడికి మంజూరైన రూ.60వేల చెక్కును సోమవారం స్థానిక నాయకులు లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చామకూరి శ్రీనివాస్‌గౌడ్, వల్లపు రమేష్, గజ్జి యాకయ్య, దండంపెల్లి ఉమేష్, కోటేష్, శివాజీ, రవి, ఏసోబు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన ఆరె అశోక్–నాగమ్మల కుమార్తె పూజిత అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండడంతో వైద్యఖర్చుల నిమిత్తం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు మండడి పూర్ణచంద్రారెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

ఊపందుకున్న ‘ఉపాధి’ పనులు

- రోజురోజుకూ పెరుగుతున్న కూలీల సంఖ్య
- పనుల్లో పాల్గొంటున్న 1,350మంది
- పని ప్రదేశంలో సరిపడా వసతులు కల్పించాలని వేడుకోలు


వేల్పుచర్ల చెరువులో పనులు చేస్తున్న కూలీలు


కొమ్మాలలో రోడ్డు పనులు చేస్తున్న కూలీలు

అర్వపల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వేసవి మొదలుకావడంతో కూలీలు అధిక సంఖ్యలో ఉదయాన్నే పనులకు వెళ్తున్నారు. అయితే ప్రస్తుతం వ్యవసాయ పనులకు సంబంధించి వరికోతలు సాగుతుండడంతో ఇప్పుడిప్పుడే పనులు ఊపందుకుంటున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో ప్రతిరోజు 1,350మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో 22పనులు..

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 17గ్రామపంచాయతీలు ఉండగా ప్రస్తుతం 22పనులు జరుగుతున్నాయి. మండలంలో 8,690 ఉపాధిహామీ జాబ్ కార్డులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం భూమి అభివృద్ధి పనులు, రైతుల పొలాలకు వెళ్లేదారులకు సంబంధించిన (రోడ్లు) పనులు జరుగుతున్నాయి. మండలంలోని రామన్నగూడెం, తిమ్మాపురం, లోయపల్లి, నాణ్యతండా, అర్వపల్లి, పర్సాయపల్లి గ్రామాల్లో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ప్రతిరోజు కూలీకి రూ.300 రావాల్సి ఉండగా రూ.213కూలీ వస్తుంది. అయితే కొలతల ప్రకారం పనిచేస్తే రూ.300 వరకు కూలీ రానుంది. వచ్చే నెల నుంచి ఉపాధి పనులు మరింత ముమ్మరం కానున్నాయి. ఎండలు తీవ్రం కావడంతో కొంత ఇబ్బంది కలుగుతుంది.

వేసవిలో రోజువారి కూలి పెంచాలి



ఎండలు తీవ్రమైన దృష్ట్యా ఉపాధి కూలి పెంచాలి. 100రోజులు పనిపూర్తయిన వారికి ఎక్కువ పనిదినాలు కల్పించాలి. బిల్లులు వెంటవెంటనే చెల్లించాలి. కూలీలకు పని ప్రదేశంలో తగు వసతులు కల్పించాలి.
– వేముల మధు, ఉపాధికూలీ

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



మండలంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. మండల వ్యాప్తంగా 1,350మంది కూలీలు 22పనులు చేస్తున్నారు. భూమి అభివృద్ధి, రైతుల పొలాలకు దారులు నిర్మించే పనులు చేపడుతున్నాం. ముఖ్యంగా ఎండల దృష్ట్యా కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలి. వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలి.
– సీహెచ్.ఉపేందర్, ఏపీఓ, ఉపాధిహామీ పథకం

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎస్పీ నరసింహ


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న ఎస్పీ నరసింహ

ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీహాస్టల్‌లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తేవాలన్నారు. అనంతరం డీఎస్పీ రవి మాట్లాడుతూ.. 10/10 జీపీఏ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2,500నజరానా ఇస్తానని, సూర్యాపేటలో చదివే విద్యార్థులకు 50శాతం ఫీజు తాను భరిస్తానని హామీ ఇచ్చారు. కాగా పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, బకెట్లు, పరుపులను ఎస్పీ అందించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్క నాటి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్, ఎస్ఐ బి.శ్రీకాంత్‌గౌడ్, తహసీల్దార్ హరికిషోర్ శర్మ, వార్డెన్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

చివ్వెంల : మండల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ నరసింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రికార్డులను చూశారు. సిబ్బంది వివరాలను ఎస్ఐ మహేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలని, పెద్దవారిని, మహిళలను గౌరవించాలని వారికి ఇబ్బంది లేకుండా సత్వర న్యాయం అందేలా చేయాలన్నారు. డ్రగ్స్, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రవి, సీఐ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

కన్స్యూమర్ పంపులపై చర్యలు తీసుకోవాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కన్స్యూమర్ పంపులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ సూర్యాపేట జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం అదనపు కలెక్టర్ పి.రాంబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిమిత వాహనాలను చూపి లైసెన్స్‌లు పొందుతున్న ఈ పంపుల యజమానులు నిబంధనలు పాటించకుండా అందరికీ పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. ఈ పెట్రోల్, డీజిల్ రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల నుంచి వస్తుందని, దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన వ్యాట్‌లో కోత పడుతుందన్నారు. స్థానికంగా పదుల సంఖ్యలో యువకులకు ఉపాధి కల్పిస్తున్న తమకు గిరాకీ లేకుండా పోతుందన్నారు. అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పంపులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి రమేష్, ట్రెజరర్ సీహెచ్.వెంకన్న, జనరల్ సెక్రటరీ పెండెల నాగరాజు, కొల్లూరు బాలకృష్ణ, మొరిశెట్టి కృష్ణమూర్తి, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు, అశోక్, నాగరాజు, శేషు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి, పస్తాల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కల్లెట్లపల్లి రాములు, వడ్లకొండ నర్సయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ బాధితులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, తాటికొండ సీతయ్య, కల్లెట్లపల్లి శోభన్‌బాబు, దోమల బాలమల్లు, కూరం వెంకన్న, ఆవుల సతీష్, అశోక్, అంజయ్య పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సూర్యాపేట : సూర్యాపేట మండలంలోని రత్నపురం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గోడదాటి వెంకన్న ఆధ్వర్యంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పీసీసీ సభ్యుడు కొప్పుల వేణారెడ్డిని సోమవారం స్థానికంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వేణారెడ్డి మాట్లాడారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొని రావాలని, గ్రామ అభివృద్ధికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇరుగు వెంకటయ్య, మార మాదయ్య, చిన వీరయ్య, రంగయ్య, వీరయ్య, రాంబాబు, సత్తయ్య, చేగూరి మహేష్, నగేష్, పేరెల్లి రాజు, మనోజ్, బన్ని, సందీప్, హరీష్, సాయిచంద్, రమేష్, సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తేవాలని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య కోరారు. సోమవారం వెలిశాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, దస్తగిరి, యాదగిరి, రామాంజనేయులు, సంతోష్‌కుమార్, ఖాదర్‌పాషా, మహేష్, అంతయ్య, నజీర్, బాబా ఉన్నారు.

ఉద్యోగులకు పెండింగ్ డీఏలు చెల్లించాలి


మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ లింగయ్య

మద్దిరాల : ఉపాధ్యాయులకు రావాల్సిన ఆరు డీఏలను వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రేపాక లింగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ముకుందాపురం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం విరామ సమయంలో ఏర్పాటు చేసిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు డీఏలు అడగొద్దని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అనడం సరికాదన్నారు. పిల్లల పెళ్లిళ కోసం తాము దాచుకున్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ డబ్బులను కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించక మరింత అప్పుల భారంతో ఉద్యోగులు సతమతం అవుతున్నారని అన్నారు. నిత్యావసర ధరలను నియంత్రించకుండా డీఏలను మాత్రం ఇవ్వలేమని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉద్యోగుల కష్టాలను గుర్తించి సకాలంలో డీఏలను అందేలా చూడాలని అన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రాములు, బి.వెంకటేశ్వర్లు, కొరివి మధు, ఎండీ.అలీమోద్దీన్, ఎస్.నగేష్, టి.శ్రీనివాస్‌రెడ్డి, పి.వెంకట్రామిరెడ్డి, ఎం.రోచిష్ణుకుమార్, ఏ.విజయ్, జి.శివకుమార్, పి.సురేష్, బి.శిల్ప పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు సక్రమంగా చేపట్టాలి


పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

మద్దిరాల : ఉపాధిహామీ పనులు సక్రమంగా చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముకుందాపురం, కుక్కడం గ్రామాలలో గత సంవత్సరం జరిగిన ఉపాధిహామీ పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో జూనియర్ క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ రామకృష్ణ, టీఏలు మురళి, అశోక్, నాగరాజు, వీరభద్రచారి, ఫీల్డ్ అసిస్టెంట్ శివయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


తిరుమలగిరి (తుంగతుర్తి) : వెలిశాల ప్రాథమిక పాఠశాలలో..

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని వెలిశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారుల వేషధారణలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆలకుంట్ల రాములు, ఎం.రేణుక తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో


అర్వపల్లి : లోయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పాత్రల్లో చిన్నారులు

అర్వపల్లి : మండలంలోని లోయపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వల్లపు నాగమణి, ఏఎన్ఎం విజయశాంతి, ఆశా కార్యకర్త మనీల, సోమమ్మ పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ధర్నా


సూర్యాపేట : మాట్లాడుతున్న బొజ్జ వెంకన్న

నూతనకల్ : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని మహజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కందుకూరి సోమన్న అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమాలు నిర్వహించకుండా ప్రభుత్వం నిషేధించడం రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను కాలరాయడమేనని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీను, పాల్వాయి బాలయ్య, గంగాధరి లక్ష్మీకాంత్, నకిరేకంటి రవికుమార్, కందుకూరి శ్రీకాంత్, ఇరుగు వెంకన్న, శ్రీనివాస్, పిచ్చయ్య, కార్తీక్, పరుశరాములు, వివేక్ పాల్గొన్నారు.

సూర్యాపేట : ఎస్సీ వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు బొజ్జ వెంకన్న అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం 9వరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరగని పోరాటం చేసి సుప్రీం కోర్టు తీర్పు వచ్చే విధంగా ఉద్యమించామని తెలిపారు. తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ముందు అమలు చేస్తామని ప్రకటించి నేటి వరకు అన్ని ఉద్యోగ నియామకాలను చేపడుతూ మాదిగ ఉపకులాలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎర్ర వీరస్వామి, గంట భిక్షపతి, పరుశరాం, సురేందర్, అనిల్, కత్తి మోహన్, శ్రీకాంత్, వేణు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక సారథి జిల్లా టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ కోరారు. సోమవారం మండలంలోని రాఘవపురంలో సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి భీమ్‌సింగ్, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, గ్రామ కార్యదర్శి సరిత, సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవం, చక్రస్నానం, అగ్నిహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని రథంలో ప్రతిష్ఠించి గ్రామంలోని పురవీధుల గుండగా వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మికాంత్, దేవాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కె.సంతోష్‌కుమార్, సభ్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాసర్లపహాడ్‌లో ఇఫ్తార్ విందు

అర్వపల్లి : మండలంలోని కాసర్లపహాడ్ గ్రామ మహ్మదీయ మజీద్‌లో ముస్లింలకు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందును సోమవారం డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పెసర సతీష్‌రెడ్డి, అమీన్, శ్రీను, యుగేందర్, రమేష్, భిక్షం, రాజేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డపుకు మల్లయ్య, తదితరులు

చివ్వెంల : మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిపై అసెంబ్లీలో సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు డపుకు మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన ఎస్సీ సెల్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల పక్షాన పోరాడుతున్న వ్యక్తిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం హేయమైన చర్య అన్నారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేకుంటే ఎత్తివేసే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో తల్లమళ్ల హస్సేన్, చంద్రమౌళి, చిరంజీవి, మీసాల శ్రీనివాస్, వంశీ, అంజిబాబు, ఉట్కూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా


మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నూతనకల్ : మండలంలోని చిల్పకుంట్ల మిషన్ భగీరథ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను చెల్లించాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడారు. ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. యాజమాన్యం ప్రతిసారి కార్మికుల వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గత నెల రోజుల నుంచి వేతనాలు చెల్లించాలని యాజమాన్యం దృష్టికి పలుసార్లు తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. యాజమాన్య వైఖరికి నిరసనగా సమ్మె చేపట్టాల్సి వచ్చిందని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎల్.రమేష్, మొగుళ్ల గోపాల్, బత్తుల హరికృష్ణ, కూసు ఉప్పలయ్య, చంద్రయ్య, రామకృష్ణ, సైదులు, రాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


పెన్‌పహాడ్ : ఎంఈఓ రవికి పరీక్ష సామగ్రి అందజేస్తున్న దాత చంద్రశేఖరరాజు

పెన్‌పహాడ్ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న హెచ్ఈఓ చంద్రశేఖరరాజు మండలంలోని 11ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 320మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ నకిరేకంటి రవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ నకిరేకంటి రవి మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా మండలంలోని పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షా సామగ్రిని అందిస్తున్నందుకు మండల విద్యాశాఖ తరుపున అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్రవంతి, ఏఎన్ఎం వీరమ్మ, సీఆర్పీలు మామిడి సైదయ్య, వహీద్, నాగు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని జలాల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం నాన్న సేవా సంస్థ వ్యవస్థాపకుడు వనగండ్ల సైదులు దాత సహకారంతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.అశోక్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవీందర్, మహేష్, దాచేపల్లి వెంకన్న, కె.వెంకన్న, అబ్బాస్ ఉన్నారు.

అనంతారం మోడల్‌స్కూల్‌లో..

మండలంలోని అనంతారం మోడల్‌స్కూల్ పదోతరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం పెన్నులు, పెన్సిల్లు, స్కేల్, జామెంటరీ బాక్స్, పరీక్ష ప్యాడ్లను పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

తుంగతుర్తి : మండలంలోని వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ సహకారంతో సోమవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉషరాణి, ఉపాధ్యాయలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరి (తుంగతుర్తి) : జలాల్‌పురంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు


తుంగతుర్తి : పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నాయకులు